# స్వయం వరము

[నాటిక]

= శ్రీ నోరి నరసింహశాస్త్రి =

**[పాత్రలు]**

డాక్టరు నాయుడుగారు
డాక్టరుభార్య
ప్రభ—డాక్టరుకుమార్తె
ప్రకాశరావు—వారి మేనల్లుడు
గఫూరు, చింతయ్య—ప్రభ సహాధ్యాయులు
శాస్త్రి—డాక్టరు కుటుంబమిత్రుడు

[డాక్టరు స్నేహితులతో మాట్లాడుకునే హాలు. కుడిపక్కన డాక్టరు రోగులతో మాట్లాడే గది. ఎడమపక్కన ప్రభ చదువుకునే గది. రెండు పక్క గదులలోకీ హాలులోనుంచి వాకిళ్లు ఉన్నవి. అవి దగ్గరగా వేసిఉంటవి. అప్పుడప్పుడు పక్కగదులలో బిగ్గరగా మాట్లాడే మాటలు హాలులోకి వినిపిస్తూ వుంటవి. హాలులో ఒక టేబిలూ, కొన్ని కుర్చీలూ ఉంటవి.

హాలువెనకగోడకు మధ్యలో వాకిలి, పక్కల రెండు కిటికీలు. గోడ అవతల వరాండా. తెర ఎత్తేప్పటికి హాలులో డాక్టరుభార్య ముందర ఒక బొమ్మల పత్రిక వేసుకుని చూచుటుంది. ఆమె పత్రిక పేజీలు తిరగవేస్తున్నా వాటివేపు చూడక మాటిమాటికీ ఆదుర్దాగా ప్రభ చదువుకునే గదివాకిలివేపు చూస్తూ ఉంటుంది. ఆవాకిలి తెరుచుకొని శాంతముగా శాస్త్రి ప్రవేశిస్తాడు.]

డాక్టరుభార్య

[ఆదుర్దాగా] ఒప్పుకున్నదా?

శాస్త్రి

ఆఁ, ఒప్పుకున్నట్లే.

డాక్టరుభార్య

[నిట్టూర్పుతో] నాకు సగము బరువు తీరినది. మరి వారికి సంగతులే పట్టవు.—చాలాసేపు మాట్లాడినారే!

శాస్త్రి

ఈ కాలపు పిల్లలు వెంటనే చెప్పినమాట వింటారా?

డాక్టరుభార్య

అందులో మాప్రభ మరీ పెంకదండీ.

శాస్త్రి

తండ్రిపోలికే.

డాక్టరుభార్య

[నవ్వుతూ] మూడు రోజులబట్టీ మా ప్రభా, ప్రకాశం ఎందుకో ఒకటే పోట్లాడుకుంటున్నారు.

శాస్త్రి

పిల్లల పోట్లాటల కేంగాని గఫూర్ అంటే ఎవరండీ?

డాక్టరుభార్య

ఆఁ, అతను మాఅమ్మాయిసహాధ్యాయి. బహు

బుద్ధిమంతుడు. ఎప్పుడన్నా మన ఇంటికి వస్తూ పోతూ ఉంటాడు.

శాస్త్రి

వాడు ప్రథను తనను పెళ్లిచేసుకోమని అడిగినాడట తెలుసునా?

డాక్టరుభార్య

ఆఁ! ఎంతమాట! వాడి కంతపొగరా—నాకు తెలియనేలేదే!

శాస్త్రి

మీ అమ్మాయి అందుకు ఒప్పుకున్నది.

డాక్టరుభార్య

[నివ్వెరపోయి క్షణము మాట్లాడదు. తర్వాత తెప్పరిల్లుకొని] అయ్యో! ఆ తురకనే!

శాస్త్రి

చింతయ్యట ఎవడండీ?

డాక్టరుభార్య

వాడూ అట్లాంటి అప్రదరిద్రుడే. ప్రథతో చదువుకోడానికి వస్తూఉంటాడు.

శాస్త్రి

విన్నారా?

డాక్టరుభార్య

ఆ మాదిగకూడా ప్రథను పెళ్లిచేసుకోమన్నాడా?

శాస్త్రి

మీ అమ్మాయి అంగీకరించింది కూడానూ!

డాక్టరుభార్య

ఇంతకూ మా కర్మం. వారు ఎంత చెప్పినా వినరు. ఎదిగిన అమ్మాయితో మాట్లాడడానికి వీళ్లంతా వస్తూ పోతూ ఉండడం నా కిష్టంలేదు. అదంతా తెల్లవాళ్లకే సరిపోయింది.

శాస్త్రి

అట్లా అనకండి! ఒక్కగాక ఒక్కకూతురు గనుక, పాపం డాక్టరుకు, అమ్మాయికి నచ్చినవాడికే ఇచ్చి పెళ్లిచేయవలె నని కోరిక. అది న్యాయమే!

డాక్టరుభార్య

మా ప్రకాశంకంటె నచ్చేవాళ్లు ఎవ రుంటారండీ!

శాస్త్రి

దానికేమిలెండి!

డాక్టరుభార్య

అయితే మీ కేంజేశారు? ఏమని ఒప్పించారు?

శాస్త్రి

ఏముందీ! — ఆ తురకను, మాదిగను చేసుకోను అనిపించేటప్పటికి నాతలప్రాణం తోకకు వచ్చింది. మాట తప్ప వల్లకాదంటుంది.

డాక్టరుభార్య

అయితే ఆ ఇద్దరినీ చేసుకుంటుందా?

శాస్త్రి

నేనుమాత్రము అమ్మాయిని అబద్ధమాడమంటానా? ఇక ప్రకాశంపేరు ఎత్తుతేనే మండిపోతున్నది.

డాక్టరుభార్య

అయితే మరి ఎట్లా సాధించారు?

శాస్త్రి

ఎంత పూర్వకాలపువారండీ మీరు! వట్టి అమాయికపు వారమ్మా! ప్రకాశరావును మీ అమ్మాయి చేసుకుంటుందనా? అయినా మీరే అడిగి చూడండి!

డాక్టరుభార్య

అయితే?

శాస్త్రి

ప్రకాశం లాభంలేదమ్మా—పోనీగదా, నన్ను మీరింత ఆదరంతో పిలిపించినారని, బాగా ఆలోచించి, మనస్సు ఎట్లాగో సరిపెట్టుకొని, ఈ చిక్కు తీర్చడానికని నేనే చేసుకుంటానంటే సరేనని కాగితం వ్రాసి ఇచ్చింది. ఇక నాకు డాక్టరుతో స్నేహమేకాక బంధుత్వంకూడా కలుస్తుంది. శాస్త్రముకూడా ఒప్పుకుంటుందిలెండి. స్త్రీరత్నం......

డాక్టరుభార్య

[ముందు నిర్ఘాంతపోయి తర్వాత కోపంగా] ఇదా మీరు చేసింది, మా కొంప ముంచారే! మీకు అనడానికి నోరెట్లా వచ్చిందండీ?

శాస్త్రి

వాళ్లిద్దరిని చేసుకోడానికి ఒప్పుకున్నది నన్నెందుకు చేసుకోదని అడిగాను. ఒప్పుకున్నది. చేసుకునే పిల్ల ఉంటే పెళ్లి ఎవరి కక్కరలేదు?

డాక్టరుభార్య

మీకు నలభైఏళ్లు దాటినవే, మా అమ్మాయి ఈడుపిల్ల

ఉన్నారే, మీరు మాకుటుంబానికి చిరకాలమునుంచి స్నేహితులుకదా అని మిమ్మల్ని నేను పిలిపిస్తే ఇంత పని చేస్తారా! ఎంత మోసముచేశారు!

శాస్త్రి

నేను మోసముచేయడమే ఎరగను. మీఅమ్మాయి మన స్ఫూర్తిగా ఒప్పుకొని కాగితంకూడా వ్రాసిఇచ్చింది.

డాక్టరుభార్య

ఇది కాకపోతే మోసమంటే ఏమిటి?

శాస్త్రి

ఇదేమిటమ్మా, మీరు సంతోషిస్తారనుకుంటే, ఇట్లా అనవసరంగా కోపపడతారు! అనుమానముంటే మీ అమ్మాయి వ్రాసి ఇచ్చిన ఈ కాగితం చూడండి. [జేబులోనుంచి కాగితము తీస్తాడు.]

డాక్టరుభార్య

ఈ పని మీ బ్రాహ్మలకే చెల్లిపోయింది. మే మింత తెలివితక్కువవాళ్లము కాబట్టే మమ్మల్ని ఇట్లా తిప్పలు పెడుతూఉంటారు. [అంటూ రివ్వున వెనక వరాండాలోకి వెళ్లిపోతుంది.]

[శాస్త్రి చిరునవ్వు నవ్వుతూ ఆవలిస్తూ చిటికెలు వేస్తూ వింటూఉంటాడు.]

కుడిపక్క గదిలోనుంచి డాక్టరుగొంతు

ఏం గఫూర్, ప్రభ ఇంట్లో లేదూ?

గఫూర్‌గొంతు

కాదు సార్—కాస్త మీతో—మాట్లాడాల్సి ఉంది.

డాక్టరుగొంతు

ఏం? ఒంట్లో కులాసాగా లేదా?

గఫూర్ గొంతు

కాదు. కాస్త ప్రైవేటుమాట సార్!

డాక్టరుగొంతు

అయితే పక్కహాల్లో కూర్చో. ఇక్కడ పనితొందర తగ్గగానే వస్తాను. అక్కడ మాశాస్త్రిగారున్నారు.— కంపౌండర్! ఇతనికి మందు కావాలిటగాని బైఫాస్ఫేట్‌మిక్శ్చరు ఇచ్చి పంపించు!

[గఫూర్ బెదురుచూపులతో కుడిపక్క వాకిట్లోనుంచి ప్రవేశము]

గఫూర్

ఆదాబ్ హజరత్!

శాస్త్రి

దీర్ఘాయురస్తు! గఫూరంటే—?

గఫూర్

నేనే సార్!

శాస్త్రి

ప్రభా, నీవూ ఒకక్లాసేనా?

గఫూర్

అవునండీ సార్.

[ఎడమపక్క ప్రభ చదువుకునే గదిలోనుంచి ప్రభా, ప్రకాశరావూ పోట్లాడుకునే కేకలు]

ప్రకాశరావుగొంతు

నీకేమైనా సెన్సు ఉందీ?

ప్రభగొంతు

జెలస్ ఇడియట్!

గఫూర్

డాక్టరుగారి అమ్మాయికి మంచి స్పిరిట్ ఉందిసార్!

కుడిపక్కగదిలోనుంచి డాక్టరుగొంతు

అయితే నీవుకూడా హాల్లో పోయి కూర్చో. అక్కడ గఫూర్ ఉన్నాడు. ఇప్పుడే వస్తాను—ఏం లాభం లేదు. అతన్ని తీసుకుపొండి!

[కుడిపక్క వాకిట్లోనుంచి ప్రవేశించి] చింతయ్య

శాస్త్రిగారూ దణ్ణము!

శాస్త్రి

మంచిది. ఓహో నీ పేరు—

చింతయ్య [గఫూర్‌కు దూరంగా కూచుండి]

చింతయ్య స్వామీ!

శాస్త్రి

ప్రభక్లాసేనా నీవు?

చింతయ్య

అవును. ప్రభగారు మంచి తెలివిగలవారండీ!

శాస్త్రి

అయితే నీవూ, గఫూరూ కొత్తవాళ్లల్లే—?

చింతయ్య

మాకు సావాసమే కాని—

గఫూర్

వాడి మాటలకు ఏమి లెండీ.

చింతయ్య

శాస్త్రిగారూ, చూచారా వాడి కెంత గర్వమో!

కుడిపక్క గదిలోనుంచి డాక్టరుగొంతు

కంపౌండర్, నేను లోపలికి వెళుతున్నాను.

కంపౌండరుగొంతు

అవుసరముంటే కబురుచేస్తాను సార్!

[డాక్టరు ప్రవేశము. గఫూరూ, చింతయ్యా నిలబడతారు. గఫూర్ వంగి సలాముచేస్తాడు. చింతయ్య వంగి దణ్ణముపెడ్తాడు.]

డాక్టరు [అందుకుని]

శాస్త్రిగారు చాలాసేపు కూచున్నట్లుగా ఉన్నారు.— ఇవ్వాళ అన్నీ పాడుకేసులండీ.

శాస్త్రి

ఫరవాలేదు. ఇక్కడ కులాసాగానే గడిచిపోయింది.

డాక్టరు

గఫూర్, ఏదో మాట్లాడా లన్నావు? [గఫూర్ మిగిలినవారివేపు చూసి సందేహిస్తాడు]

అంతా మనవాళ్లే, ఫరవాలేదులే. అంత మరీప్రైవేటా?

గఫూర్

కాదులెండి కాని...[సందేహిస్తూఉంటాడు]

డాక్టరు

అయితే ఇంకా ఏం? శాస్త్రిగారికీ, నాకూ రహస్యాలు లేవు. చింతయ్య నీకు ముఖ్యస్నేహితుడాయెను. మళ్లీ ఎవరయినా రోగులు వస్తే వెళ్లవలసి ఉంటుంది. తొందరగా కానీ!

శాస్త్రి

పోనీ, నే నవతల పోయి కూర్చొనేదీ?

గఫూర్

ఎందుకులెండి సార్...మీఅమ్మాయి-[అనుమానిస్తాడు]

డాక్టరు

నీతో ఏమైనా పోట్లాడిందా ఏమిటి?

గఫూర్

లేదు సార్ లేదు—చాలా మంచి అమ్మాయి అండీ!

డాక్టరు

అయితే?

గఫూర్

మీరు చాలా అడ్వాన్సుడువ్యూస్ గనక—

డాక్టరు

ఏమిటి?

శాస్త్రి

కుర్రవాడు ఏవివాహముసంగతో చెప్పబోతూ సిగ్గుపడుతూఉంటే, అట్లా తొందరపడతారేం డాక్టర్?

గఫూర్

శాస్తుల్లగారు సరిగ్గా చెప్పారు. నాకు ప్రభను ఇచ్చి పెళ్లిచేయమని అడగడానికి వచ్చాను సార్!

డాక్టరు

[ఆలోచిస్తూ] అట్లాగా — నా కభ్యంతరము లేదుకాని మాఅమ్మాయి చేసుకుంటా నన్నవాళ్లకు తప్ప దాన్ని పెళ్లిచేయను. ఇంకా చదివేది ఇంటరుమీడియేటేగా! బి. ఏ. ప్యాసుకానిది బహుశహా చేసుకోదు.

గఫూర్

ప్రభ ఒప్పుకుంది సార్.

చింతయ్య

వీడు చెప్పే దంతా అబద్ధమండీ!

గఫూర్

[వచ్చే కోపము అణుచుకుంటూ] నీకు తెలియదు ఊరుకోవోయి!

చింతయ్య

నీకు మహా తెలుసు. వట్టి జూటాకోర్!

డాక్టరు

చింతయ్యా, అతన్ని చెప్పనీ—

చింతయ్య

దణ్ణం పెట్టి మనవి చేస్తా. మీకు తెలియదు కాని వీడు పెద్ద హంబగండీ!

[గఫూర్ పెదిమలు వణుకుతవి]

డాక్టరు

అంత తొందరపడతావేం చింతయ్యా?

చింతయ్య

ప్రభగారు నన్ను చేసుకుంటా నన్నారండీ. మీతో మనవి చేసుకుందామనే వచ్చాను బాబూ!

గఫూర్

వీడు వట్టి స్కౌండ్రెల్ సార్.

చింతయ్య

నీవు రాస్కెల్!

గఫూర్

ప్రభ ఈ బేవఖూబ్ గాడిదను చేసుకుంటుందండీ!

చింతయ్య

వీడు బ్లాగ్గర్డు అండీ.

గఫూర్

వీమా ఫూల్ సార్! లయర్ సార్!

చింతయ్య

నిన్న సాయంత్రమండీ. ప్రభగారిని అడగండి!

గఫూర్

వీడిమొఖమ్. నిన్న పొద్దునే నాకు చెప్పింది. ఈ బద్మాష్ మొఖం చూడనుకూడా చూడను సార్ ప్రభ.
[డాక్టరు నివ్వెరపోయి చూస్తూఉంటాడు.]

శాస్త్రి

[నెమ్మదిగా] వీళ్లిద్దరి మాటలూ నిజంగానే కనపడుతున్నాయి నాకు.— అయితే నీ వేమంటావు చింతయ్యా?

చింతయ్య

బాబూ, మీకు దణ్ణంపెట్టి చెప్తాతా వినండి. ప్రభగారికి మంచి జాతీయభావము ఉంది స్వామీ. హరిజన సమస్య సాల్వుచేయడానికి నన్ను పెళ్లిచేసుకుంటానని నిన్న సాయంత్రమే చెప్పింది. వీడు మహా పోగరుబోతు అనికూడా అంది. లేకపోతే నేను ఇటువంటి పెద్దవారివద్ద అబద్ధము చెబుతానండీ?

శాస్త్రి

ఓహో! — అయితే, గఫూర్! నిన్ను హిందూ ముస్లిముబందోబస్తుకోసం చేసుకుంటా నన్నదా?

గఫూర్

[ఆశ్చర్యంతో] అవును సార్. సరిగ్గా నిన్న పొద్దునే - శాస్త్రిగారికి అంతా తెలుసు!

శాస్త్రి

డాక్టర్! మీరు మీఅమ్మాయికి చిన్నప్పుడే వివాహము చెయ్యమంటే స్వయంవరణము లేనిది చేయనని ఆపినారుకాదూ!

డాక్టరు

అవును, ఇప్పటికీ మాఅమ్మాయి ఎవరిని చేసుకుంటా నంటే, వాళ్లకే తప్ప ఇంకొకరికి బలవంతాన ఇయ్యను.

శాస్త్రి

ఇప్పటికీ ఆపట్టుదల మానలేదన్నమాట?

డాక్టరు

మానడానికి ఇప్పు డేం జరిగింది?

గఫూర్

డాక్టరుగారు మాట తప్పరని అందరికీ తెలుసు!

శాస్త్రి

మాటమీద నిలబడతారుగా?

డాక్టరు

ఆహా!

చింతయ్య

డాక్టరుబాబుగారు అబద్ధమాడడమే!

శాస్త్రి

మీకు బ్రాహ్మలంటే సరిపడదుగా. ఎవరయినా బ్రాహ్మణ్ణి చేసుకుంటా నంటే ప్రభ నిచ్చి చేస్తారా?

డాక్టరు

[నవ్వుతూ] అప్పుడు కాస్త ఆలోచించవలసిందే!

శాస్త్రి

ఇంకొకరిని చేసుకో నంటే?

డాక్టరు

విధిలేక ఆబ్రాహ్మణ్ణి తిట్టుకుంటూ ఇస్తాను.

శాస్త్రి

ఇస్తారుగా!

డాక్టరు

ఆ!

డాక్టరుభార్య

[వెనకవరాండాలోనుంచి రివ్వున లోపలికి వచ్చి] బ్రాహ్మలు ఎంత స్నేహితు లయినా మోసము చేయక ఊరుకోరండీ.

డాక్టరు

బ్రాహ్మలను తిట్టకూడ దని నాకు చెప్పేదానివి నీవు ఇట్లా తిరిగిపోయినావేం?

శాస్త్రి

స్త్రీల మాటలకేం గాని—గఫూర్! నిన్ను ప్రభా చేసుకుంటా నని ఒప్పుకున్నట్లు సాక్ష్య మేమిటి?

గఫూర్

ప్రభనే అడగండీ.

శాస్త్రి

అంతేనా ?— పోనీ, ఈ పెళ్లి ఎట్లా చేసుకోవడమో ఆలోచించావా ? ప్రభ మహమ్మదీయులలో కలుస్తుందా, నీవు హిందువులలో కలుస్తావా ?

గఫూర్

ఆలోచించలేదు సార్. కోపం వద్దు. మాకు మీ హిందువులలో కలవడం తప్పు కాదు సార్ ! మా నాన్న......

శాస్త్రి

పోనీ, చింతయ్యా, నీకన్నా వ్రాతపూర్వకమైన సాక్ష్యముందా?

చింతయ్య

ఇక్కడే ప్రభగారు ఉన్నారుగా అడగండి బాబూ.

డాక్టరు

శాస్త్రిగారు ఇక్కడకూడా ప్లీడరుగిరీ మరిచిపోయినట్లు లేదే?

డాక్టరుభార్య

అసలే బ్రాహ్మలు! అందులో ప్లీడరు!

డాక్టరు

[ఆశ్చర్యంతో] ఏమిటి ?

శాస్త్రి

అయితే చల్లకు వచ్చి ముంత దాచడ మెందుకూ? మీ ప్రభను నా కీయమని అడగడానికే ఇంతసేపు కూచున్నాను డాక్టర్!

డాక్టరు

[ఫక్కున నవ్వి] మీకేం మతి పోలేదుకదా, శాస్త్రి గారూ!—కంపౌండర్!

పడిపక్కనుంచి కంపౌండరుగొంతు

సార్ !

డాక్టరు

శాస్త్రిగారికి కాస్త స్లీపింగుడోజు తయారుచెయ్యి.

శాస్త్రి

మాట్లాడాలిసింది సవాలక్షగ్రంథ ముంటే, అప్పుడే నిద్దరపోతే ఎట్లా ? వీళ్లకు వేరే దాఖలాలేదుకదా! ఎక్కడన్నా పెళ్లిచేసుకునే పిల్ల సిగ్గుపడకుండా ఇంత మందిలో వచ్చి తనకు ఎవరిష్టమో చెబుతుందా? ఇది చూడండి!

[జేబులోనుంచి కాగితం తీసి డాక్టరు కిస్తాడు.]

డాక్టరు [బిగ్గరగా చదువుతాడు]

"శాస్త్రిగారికి ప్రభ వ్రాసి ఇచ్చిన అగ్రిమెంటు. నేను మిమ్మల్నుగాని, మీ ఇష్టము వచ్చినవారిని గాని తప్ప ఇంకొకరిని వివాహమాడను. ఇది మంచి వ్యక్తతతో మనస్ఫూర్తిగా వ్రాసి ఇచ్చిన అగ్రిమెంటు.

ప్రభ

(దస్తూరీ స్వహస్తము)"

డాక్టరుభార్య

ఇందుకనే బ్రాహ్మలను నమ్మరాదు.

డాక్టరు

[ఆలోచిస్తూ] అమ్మాయిదస్తూరే!

గఫూర్

నాకు ప్రభ వద్దులెండి సార్ !

[నిష్క్రమిస్తాడు]

శాస్త్రి

పిల్లలు ఎదుగుతే వాళ్ల ఇష్టము వచ్చినవాళ్లనేగాని చేసుకోరు. తల్లిదండ్రులుకూడా మంచీ చెడ్డా ఆలోచించుకునే వీలుండదు.

డాక్టరుభార్య

మీ మాటకు నే నెప్పుడూ అడ్డు చెప్పలేదు కాని నా ప్రాణం పోయినా ప్రభను శాస్త్రిగారికి ఇవ్వనీయనండీ.

శాస్త్రి

మరి వాళ్ల కిద్దరికీ ఇస్తారా?

డాక్టరుభార్య

ఆ వె.. వాళ్లకు మాత్రం?

డాక్టరు

తారీకుకూడా ఈ రోజే. మరి అమ్మాయి శాస్త్రిగారిని తప్ప ఇంకొకర్ని చేసుకోనంటే ఏంచేస్తాము?

చింతయ్య

నాకుమాత్రము ప్రభగారు ఎందుకు లెండి! [దణ్ణాలు పెడుతూ నెమ్మదిగా జారుతాడు]

డాక్టరు

[కాగితము తిరగవేస్తూ] ఇది అమ్మాయిచేత నవ్వులకు వ్రాయించలేదుకదా!

శాస్త్రి

అందులో ఏమని ఉంది?

డాక్టరు

అవును. "మనన్ఫూర్తిగా..."

డాక్టరుభార్య

వీరికి నలభైఏళ్లు దాటినై. నాయుడుభార్య ఉన్నది. మన అమ్మాయికంటె పెద్దపిల్ల లున్నారు. ఒకవేళ చిన్నతనంచేత అమ్మాయి చేసుకుంటానంటేమాత్రము, మనకన్నా మతి ఉండవద్దా ?

శాస్త్రి

అమ్మాయి మేజరు కాలేదా ఏమిటి?

డాక్టరు

పంథొమ్మిదో ఏడు వచ్చి మూడురోజు లయింది.

డాక్టరుభార్య

ఏమిటండీ ఈ పిచ్చికాగితాలు! చింపి పారేస్తాను—ప్రభను ప్రకాశానికి ఇవ్వవలసిందే కాని ఇంకొకరికి ఇవ్వడానికి ఒప్పుకోను.

డాక్టరు

నాకూ అందుకు ఇష్టమే కాని, చూడూ! [ఎడమ గదిలోనుంచి ప్రభ, ప్రకాశం పోట్లాటచప్పుడు.] —చూడూ, వాళ్లెట్లా పోట్లాడుకుంటున్నారో! ఎప్పుడూ అంతే. దానికి ఇష్టము లేకపోతే ఏం చేస్తాము!

డాక్టరుభార్య

ఇష్ట మేమిటండీ! మీకు నన్ను ఇచ్చేటప్పుడు మా నాన్న నా ఇష్టము అడిగే ఇచ్చాడా, మన కాపరానికి ఏం లోటు! వాళ్లూ అట్లాగే చిలకా గోరింకలలాగా ఉంటారు. ఈ గోల లేకుండా వాళ్లిద్దరికీ త్వరగా ముడిపెట్టండీ.

శాస్త్రి

సత్యహరిశ్చంద్రు డని పేరుపడ్డ డాక్టరు స్త్రీల మాటలు విని అన్నమాట తప్పితే ఆయనమాట ఆయనకే ఉంటుంది. నాసామ్మేం పాయె! [బిగ్గరగా] ప్రభా! ఇట్లా రా!

[ప్రభ సిగ్గుపడుతూ ఎడమగదిలోనుంచి ప్రవేశిస్తుంది.]

శాస్త్రి

[ప్రభను దగ్గరకు తీసుకొని] తల్లీ, నాకూ నీ వక్కర లేదులే! మీఅమ్మగారు నిన్ను వాళ్ల ప్రకాశరావుకు తప్ప మరెవరికీ ఇవ్వనంటున్నది కాని, పోనీ నువ్వా అతన్నే తప్పక చేసుకో అమ్మా! [ప్రభ సిగ్గుతో తల వంచుకుంటుంది.] ప్రకాశరావ్! ఇట్లా రా!

[ఎడమగదివాకిటిదగ్గర ఉన్న ప్రకాశరావు ప్రవేశించి డాక్టరుభార్యదగ్గర నిలుచుంటాడు.]

శాస్త్రి

నువ్వు ప్రభతో ఎప్పుడూ పోట్లాడుతుంటా వెందుకూ?

ప్రకాశరావు

నేను ఎప్పుడూ పోట్లాడనండీ, అదే ఎప్పుడూ పోట్లాడుతుందికాని.

ప్రభ

అబద్ధము చెప్పవాక.—అది కాదండీ.ఎవరన్నా నాతో మాట్లాడడానికి స్నేహితులు వస్తే, నామీద ఇతను కొరకొరలాడుతూ ఉంటాడండీ!

ప్రకాశరావు

లేకపోతే, ప్రతి పనికిమాలినవాడితోటీ స్వతంత్రంగా ఉండడం ఎందుకండీ ఇది?

ప్రభ

ప్రకాశరావు ఎంత చదువుకున్నా కట్టి కన్వెన్షనల్ మనిషండీ!

డాక్టరుభార్య

సరేలేగాని, ప్రకాశరావ్! నీకు ప్రభను ఇచ్చి వివాహము చేస్తాను ఇష్టమేనా?

ప్రకాశరావు

నీమాటకు ఎప్పుడన్నా ఎదురు చెప్పినానా?

డాక్టరు

ఇందులో మధ్య నాదేమీ లేదా ఏమిటి?

డాక్టరుభార్య

ఏమీ లేదు. అమ్మాయిని స్వయంవరానికి వదిలినతర్వాత ఇంకా మీకేముంది?

డాక్టరు

[నవ్వుతూ] ఓహో! మరి నీదో?

డాక్టరు భార్య

అంతా నాదే. శాస్త్రిగారూ, మీ రివ్వాళ ఈ నాటక మాడి చాలా శ్రమపడ్డారుకాని పనిలో పని త్వరలో లగ్నంకూడా మీరే పెట్టండి.

శాస్త్రి

శుభస్య శీఘ్రం! ఇప్ప డెంతయింది?

డాక్టరు

[చేతిగడియారం చూసి] తొమ్మిదీ నలభై ఆరు నిముషాలు!

శాస్త్రి

అయితే సరిగ్గా ఇప్పుడే మంచి లగ్నమున్నది. ప్రభా! నీవు మీ నాన్నగారు అమ్మగార్లదగ్గరకు వెళ్లమ్మా! [వెళుతుంది] ప్రకాశరావుకు తల్లీ, తండ్రీ లేరు కాబట్టి నేను అతనితరఫున వ్యవహరిస్తాను. నాయనా, ఇట్లా రా!

[ప్రకాశరావు శాస్త్రిదగ్గరకు వస్తాడు. డాక్టరూ, భార్యా ప్రభచెయ్యి ప్రకాశరావుచేతిలో పెడతారు. ఆకాశవాణి మంగళం పాడుతుంది.]

ఆకాశవాణి

మంగళం మంగళం!
మనరాములకు
మంగళం మంగళం!

శాస్త్రి

తథాస్తు!

డాక్టరు భార్య

ఇద్దరూ పోయి శాస్త్రిగారికి నమస్కారం చేయండమ్మా!

డాక్టరు

నీ బ్రాహ్మణభక్తి—

ప్రభ

శాస్త్రిగారూ, చూడండీ ప్రకాశరావు నాచెయ్యిఎట్లా నలిపివేస్తున్నాడో!

ప్రకాశరావు

ప్రభ నాచెయ్యి ఎట్లా గిల్లిందో చూడండీ!

[తెర]

